★

# సూర్యకాంతి

## “సావేరి”

★



పాడు ఆలోచనలతో మనస్సంతా పాడై పోయింది. అట్లాగే బలవంతంగా కళ్లు మూసుకుని కునుకుతీస్తున్నాను. నా ప్రక్కనే చాపకి కరుచుకుని అడ్డంగా పడుకున్న మా అన్నయ్య ఇంగ్లీషులో ఉపన్యాసమిస్తున్నాడు. రేపు సాయంత్రం జరగబోయే స్కూలువార్షికోత్సవసందర్భాన.......... కాళ్లూ చేతులూ తన్నుకుంటున్నాడు. చాపకి రెండో చివర్న మా మామయ్య పళ్లు కొరుకుతున్నాడు.

ఏం చెయ్యను. భయం వేసింది. చిన్నవాణ్ణి అట్లాగే పడుకున్నాను. నిద్ర పట్టిందేమో, తెల్లవారిందేమో వంటగదినుండి కెవ్వుమని చెల్లెలి కేక విన్పించింది. అదిరిపడ్డాను. నాతోపాటు మేలుకునేవున్నారేమో - నేనూ మా మామయ్యా, అన్నయ్యా ఒక్కసారే లేచాము. ఏమి ఉపద్రవం వచ్చిపడిందోనని గబగబా పరుగెత్తుకుంటూ మా అమ్మా చెల్లెలూ, పడుకునివున్న వంటగదిదగ్గరికి పోయాము. కుక్కిమంచంనుండి క్రిందపడి మోచేతులు పగిలి రక్తం కారుతున్న చెల్లెలు వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

“అమ్మ అమ్మ అమ్మ - అమ్మ ఏది ?”- అని ప్రశ్నిస్తున్నది.

గాభరాపడ్డాము. ఒకరి మొఖాలొకరు చూచుకున్నాము. ఏమి సమాధానంచెప్పేది?

వంటగదిలో అలికిడయ్యింది, వంట సామాన్లని ఎలికలు దొర్లిస్తుంటే అదిలించడానికి అమ్మ వంటింట్లోకి వెళ్లిందేమో - అనుకున్నాము. వెళ్లి వెతికాము. లేదు. అమ్మ కన్పించలేదు. భావిలో దూకిందేమో. అనుమానం వచ్చింది. భయం వేసింది. మమ్మల్నందర్నీ వదలిపెట్టి ఇంత అకస్మాత్తుగా అమ్మ ఇట్టి అఘాయిత్యానికి వడిగడుతుందా ? తెలియదు. చిన్నవాణ్ణి. ఏమీ తెలియదు. చెల్లెల్ని భుజంమీద పడేసుకున్నాను. కానీ అమ్మని దేవులాట్టానికి, ఆ వూహని మరొకరికి చెప్పడానికి ఒకరొకరము భయపడ్డాము.

“అమ్మ తాతయ్యగారింటికి వెళ్ళింది, ఇప్పుడే వస్తుందమ్మా. ఊరుకో. అలా ఏడిస్తే అబ్బి పట్టుకుపోతాడు——” చెల్లెల్ని సముదాయిస్తున్నాము. ఎంతకీ వినటం లేదు. ఏడుపు మానడం లేదు. దేవుడా, ఏమిటీ ఖర్మ. ఎన్నాళ్లీకష్టాలు. కనీసం వెతకడానికూడా ఇంట్లో దీపం లేదు. ఉన్న ఆ ఒక్క ఆముదంప్రమిదా ఎప్పుడో కొడిగట్టి పోయింది. కిరసనాలు లేదు. ఇంట్లో పంచదార లేదు. ఐనా పోయేకాలం కాకపోతే బీదవాడికి ఇన్ని ఆలోచనలు ఎందుకు! కోర్కెల్ని చంపుకోరాదూ! ఎప్పుడైనా హోటల్లో కాఫీతాగే అదృష్టమేగనక వుంటే అక్కడే ఎవరూ చూడకుండా - చాటుగా ఒక చెంచాడు పంచదార బొక్కితే సరిపోదూ! ఐనా మనవి గొంతెమ్మకోర్కెలుగాని, బీదవాడికి పంచదారా కిరసనాలూ ఎక్కడనుంచి వస్తాయి?

అన్నయ్య స్కూల్లో అటెండరు. ఉపన్యాసాన్ని ఒక కళగా తీసుకొని ఉపాసిస్తున్నవాళ్ళల్లో ఒకడు. చాలీచాలని జీతముతో, కుటుంబభారంతో క్రుంగిపోతున్న భారతీయుల్లో ఒకడు. పెళ్లి పెడాకాలూ లేక అవస్తపడుతున్న మా మామయ్య...

* * * *

మధ్యాహ్నంవరకు చూశాము. అమ్మ జాడ తెలియలేదు. పాతికేళ్లనుండి మా యింటి మొఖం చూడని తాతయ్య వచ్చి, ఆ పూటకి వాళ్ళయింటికి తీసుకవెళ్లాడు. మాకు తెలుసు, వాళ్ళ సంసారంకంటె ఒకరకంగా మాదే మెరుగని. ఒకపూట తినీ ఒకపూట తినక...

చెల్లెలు మాటిమాటికీ అమ్మని అడుగుతుంది. దిగులుపడుతుంది. అమ్మనిగురించి ఏ క్షణాన ఎట్టి దుర్వార్త వినాల్సివస్తుందోనని కుమిలిపోతున్నాము. ఆ పూట అన్నం తినలేదు. సయించలేదు... బలవంతంమీద తిన్న చెల్లెలు, డోకు వచ్చి, జ్వరం వచ్చి, మనస్వరంతితప్పిపడిపోయింది. ఏమీతోచదు. చెరువుగట్టుమీద విస్తుపోయి కూర్చున్నాను.

అమ్మ ఏమిటూ మమ్మల్ని నట్టనడిచీకట్లో వదిలి వెళ్లిం దేమిటూ అని. ఎక్కడికి వెళ్లింది? ఇన్నేళ్ళనుండీ ఈ సంసారాన్నీ, ఈ సరుకులూ బరువులూ లాడు బేడూ, కష్టాల్నీ ఈదుకొస్తున్న అమ్మ ఎక్కడికి వెళ్లినటు.

నాన్నని చూడటానికా. నాన్న ఇంటి పట్టుకి రావడం మానివేసి నెల్లాళ్లయింది.

అవును. ఆయన్ని మ్మాస్తే కడుపునపుట్టిన బిడ్డలే ఈసడించుకుంటారు. పైనబడి కొట్టబోతారు. దరిద్రాన్ని తిని బ్రతుకుతున్న కొడుకులు. ఇంక నాన్న అట్లాంటి గడపనెలా తొక్కుతాడు?

అప్పటికీ ఎవరికీ తెలియకుండా ఏ అర్ధరాత్రో వచ్చి చెల్లెలి చేతిలో రూపాయి పెట్టిపోతాడు. ఆ విషయం ఎవరికీ తెలియకుండా దాస్తుంది, అమ్మ. దిగులుపడుతుంది. మామయ్యకి కోపం వస్తే మనిషి కాదు. ఊరుకోడు. అమ్మకి భయం. చెల్లెలు ఒట్టి పిచ్చిది. అన్నీ చెబుతుంది. ఐనా అంత చిన్నతనంలో కుళ్లిపోయిన మనస్తత్వాలని చెల్లెలు ఎలా అర్థం చేసుకోగలదు? చెబుతుంది. రోజల్లా చెబుతుంది. తనకి నాన్న కనపడ్డాడని, రూపాయ కాసు యిచ్చాడని. పిచ్చిపిల్ల అన్నీ చెబుతుంది. ఈ భూమ్మీద పడినందుకుగాను ఇతరుల భయపడి నీవు నీ ప్రేమను చంపుకోవాల్సి వుంటుందని చెల్లెలి కేమి తెలుసు.

నాన్న యిప్పుడు మాకు రెండువందల మైళ్ల దూరంలో వున్నాడు. జూదంలో ఓడిపోయాడనీ, తప్పతాగితే పట్టుకుని జైల్లో పెట్టారనీ, రాజమండ్రి పంపారనీ ఊళ్లో పరిపరివిధాల చెప్పుకుంటున్నారు. అంత దూరంలో వున్న నాన్న విషయం మా కెలా తెలుస్తుంది. ఇంతవరకు పరాయి వూరైనా వెళ్లని అమ్మ అంతదూరం వెళ్తుందంటే ఎలా నమ్మను?

పూలు, తల్లీ, చెప్పుకింద పూలు.

* * * *

ముప్ఫయ్యేళ్ల మామయ్య, పనీపాటలూ లేని మామామయ్య. పెరిగి పెద్దయినతర్వాత చెల్లెల్ని చేసుకుని సుఖపెడతాడుగదా అని మా అమ్మఆశ. అందుకు మా మామయ్య ఏమన్నా లోపల్లోపలే ఏడ్చి, పడివుంటుంది గాని, పైకి ఒక్కమాటా పెకలడానికి వీల్లేదు.

పసివాళ్లమే అయినా మూర్ఖులవలె అన్నీ చూస్తూ వూరుకోవాల్సిందే తప్ప, అన్నీ తెలిసికూడా అందరివలెనే సుఖంగా బ్రతుకుతున్నట్టు అందరికీ కన్పించడంతప్ప, బీదవాళ్లు ఏం చేయగలుతారు. డబ్బు లేని వాళ్ల మాటకి చెలామణీ ఎక్కడ. చెల్లేది ఎక్కడ—

మనం వెనకటి జన్మానికి పుణ్యం చెయ్యలేదు. పూజా పునస్కారాలు చెయ్యలేదు. సుఖాలకి నోచుకోలేదు.

వైధవ్యం చెందిన మనస్సులతో దుఖాలు అనుభవించడానికే పుట్టాము అంతే. అన్నీ అనుభవించాల్సిందే. అంతేగాని, నోరు విప్పకూడదు. మాకు ఇది కావాలి - అని అడగకూడదు. అది మర్యాదస్తుల లక్షణం కాదు. మన ఖర్మ అనుకొని ఖునమటుకి మనం శాంతంగా గట్టుగా కాలాన్ని వెళ్లదీయడమే మనం ఈలోకంలో చేయాల్సింది.

అర్థం కాదు. చిన్నవాణ్ణి, ఒట్టి మూర్ఖం తప్ప, నామీద నాకు అభిమానం తప్ప, ఏమీ అర్థం కాదు. భయం తప్ప, డాంబికం తప్ప, ఏమీ చేత కాదు. ఏం చెయ్యను? కూడు పెట్టని ఈచదువుల్తో ఎలా బ్రతికేది?

ఇప్పుడు అమ్మగనుక లేకపోతే మా గతేం కాను. మమ్మల్ని చూసేవాళ్లు, నవ్వించి కవ్వించి, కష్టాల్ని మరపించి, కడుపులో పెట్టుకుని లాలించేవాళ్లు మా కెవరున్నారు? కిఇంక మేము దిక్కూ దివాణమూ లేకుండా పరాయిపంచన పడి బ్రతకాల్సిందేనా. ఏం చేయను నేను?

అమ్మ పోవడం అలా వుంచి, మామయ్య అమ్మని తిట్టే తిట్లకు ఒళ్లు కంపర మెత్తిపోతున్నది. లోకువ. గత్యంతరం లేదు. ఇంత లోకంలో మామీద ఇంత కనికారం చూపించేవాళ్లెరి? ఏం చేసేది, మరి.

ఈ హిందూదేశంలో పుట్టినందుకుగాను, పేదసంసారాలు ఆడుబిడ్డల్ని కన్నందుకుగాను కుళ్లి కునారిల్లిపోవాల్సిందే కాని, నోరు విప్పకూడదు. ఇది శాపం. నల్లటి చిక్కటి సరీసృపాల్లాంటి శాపం ఇది.

కానీ మా అమ్మ తన నలభయ్యోయేట మతిభ్రష్టురాలయిందని - కొడుకునై వుండీ, ఆమెని నా చిన్ననాటనుండీ ఎరిగివుండి ఎలా అనుకునేది? అనుకోకుండా నన్ను నేను ఎలా వంచించుకునేది. ఐనా ఇందులో అనుకోకపోవడానికి ఏముందిగనక.

అవును. ఇట్టి బాధలవల్ల ఆమెమనస్సు విరిగిపోయింది. ఐతే అమ్మ ఇంక తిరిగి రాదా మమ్మల్ని విడిచిపోయి, మమ్మల్ని ఎలా మర్చిపోగలదు? సంసారాన్ని త్యజించడం అంత సులభసాధ్యమా? ప్రేమనీ వాంఛల్నీ తెగతెంపులు చేసుకోవడానికి సర్వసంగపరిత్యాగం చేసి సన్యాసుల్లో కలిసిపోవడానికి మనిషి కెంత కరుకుతనం వుండాలి.

ఐతే ఇంట్లో ఏ పోట్లాటలు మనస్పర్థలు - ఏ జాతరా లేదుగదా. మరి ఆవిడ ఎందుకు వెళ్లిపోయింది.

ఇవాళ తెలుసుకుంటున్నాను. తల్లి వదనం లోజురోజుకీ విచారగ్రస్తమైపోవడం గురించి. కళావిహీనమైపోవడంగురించి. లోజులోజుకీ కృశించి, పిచ్చిదైపోతున్నదని. కానీ మావల్ల ఏమి అవుతుంది. కడుపునిండా కూటికి నోచుకోనివాళ్లు ఏం చేయగలుతారు. అమ్మ మావల్ల, మా అప్రయోజకత్వంవల్ల మాగురించి ఎన్ని బాధల కోర్చేది. ఎన్ని కష్టాలని పడుతుంది. కలకాలం కష్టాలు కాపుర ముండవని నిన్నూ నన్నూ మోసగిస్తా రెందుకు? కడుపునిండిన మాటలు చెబుతారు ఎందుకని!........ అమ్మకి ఇప్పటికైనా మా జంఝాటం వదలడంవల్ల, ఇప్పటికైనా ఆమె ఎక్కడవున్నా, కొంత సుఖంగానైనా వుండగలిగితే అదే పదివేలు మాకు. అదే పదివందల లక్షల వేలు, మాకు.

(33-వ పేజీ చూడుడు)

# సూర్యకాంతి

(14 పేజీ తరువాయి)

అట్లా కోరసంకంటే, పదుగురి మంచిని అభిలషించడంకంటే, మేము చేయగల్గిందేమి వుంది. కానీ భయం తుఃణతుఃణానికి మనస్సుని తినివేస్తున్నది. అమ్మ తిరిగి రాదేమో ననే భయం. ఏం చేయను. ఇట్లా బ్రతకాల్సిందేనా. మేం చేసిన తప్పేమిటి? మేము కూడా నలుగురిలో తలఎత్తుకు తిరగడానికి, సుఖంగా బ్రతకడానికి మేం చేసిన తప్పేమిటి?

ఇట్లా ఆలోచిస్తున్నాను. ఏమీ తెలియదు? ఒట్టి మూర్ఖం తప్ప. అన్యమూ పుణ్యమూ ఎరుగను.

ఆ రోజల్లా ఎక్కడెక్కడో తిరిగాను. పిచ్చిపిచ్చిగా ఎక్కడెక్కడో తిరిగాను. చీకటి పడుతున్నది. ఎన్ని కష్టాలు వచ్చినా ఇల్లు తప్ప శాంతి నిచ్చే వస్తువు మరొకటి కన్పించదు. ఇల్లు చేరుకున్నాను. బావురుమంటున్న ఇల్లు. ఖడ్గమృగంవలె మునిగాళ్ళమీద కూర్చుని కబళింప సంకించే యిల్లు! చెల్లెలు అలిసిపోయి మగతగా జ్వరంలో, తెలివి తప్పి నిద్రపోతున్నది.

భయం. రాత్రిళ్లు నిద్రపోకుండా నాన్న తిరిగివస్తాడనే ఆశతో భయంభయంగా ఎదురుచూసే అమ్మకళ్లు నన్ను వెంటాడుతున్నవి. ఇంటి చుట్టూ అమ్మకళ్లు. భయం. వెడల్పయిన అమ్మకళ్లు. నిద్రలేక మతిస్థిరత్వం లేక జబ్బుచేసి డాక్టర్లు లేక మందులు లేక మనోవ్యాధితో కృశించి క్రుంగిపోతున్న అమ్మకళ్లు భయంకరంగా ఆందోళనగా నన్ను పీడిస్తున్నవి. భయం. వొణుకు.

మెల్లగా పిల్లిలా ఇంట్లోకి మునివ్రేళ్ల మీద వెళ్లాను. చెల్లెలు దీర్ఘనిద్రలో మునిగి వుంది. మా మామయ్యా అన్నయ్యా అమ్మని వెతకడానికి పోయినవాళ్లు ఇంతవరకు రాలేదు.

"చిన్నీ!" – కేక విన్పించింది.

"అమ్మా. వచ్చావా" – ఆత్రుతగా తలుపు తీశాను. గట్టిగా అమ్మకాళ్లు పెనవేసుకుని, ఒళ్లెకడిలో తల పెట్టి వెక్కివెక్కి ఏడ్చాను. మనశ్శాంతి. ఓదార్పు మాటలు.

"మా నాయనగదే, నేను ఎక్కడికి వెళ్తాను రా. మిమ్మల్నిందర్ని వొదిలిపెట్టి నే నెక్కడికి పోతాను. మా బాబుగదూ. ఊరుకో. భయపడ్డావా. పిచ్చినాయనా, నేను వుండగా భయ మెందుకూ........"

"చిట్టి నిద్రపోతున్నదా?" – అమ్మ భారంగా అడుగులు వేసుకుంటూ చెల్లెలి కోసం గబగబా పోతున్నది. వెనక నేను.

ఇంత కాళరాత్రివేళ భారమై సాగిపోతున్న అమ్మ అడుగులవెంట సూర్యరశ్మి పోతున్నది.

చెల్లెలికి జ్వరం తీవ్రంగా వచ్చింది. మాటా మంతీ లేకుండా పడివుంది. నాకు భయంగా వుంది.

నాకు తెలుసు. అమ్మ తిరిగివస్తుందని నాకు నమ్మకమే. ఇంత సంసారాన్ని వదిలిపెట్టి, సర్వం తెగతెంపులు చేసుకుని పారిపోవడానికి కన్నతల్లికి ధైర్యం చాలదు. ప్రేమ పోనీయదు. అది ఒట్టి కథల్లో తప్ప, ఒట్టి మా భయం తప్ప, తన బిడ్డల్ని, తన బిడ్డల జీవితాన్ని ఎలాగోలాగ ఈడ్చుకుపోవాల్సిందే తప్ప, జీవితాన్ని తునాతునకలు కానీయదు. తప్పల్ని, నాన్నమీద దూషణనీ నిందించదు. అన్నీ చూస్తుంది. ఆలోచిస్తుంది. అంతేగాని...

ఐతే తల్లిని తిరిగి యిచ్చిన భగవంతుడు, 'బదులు తీర్చుకుంటాడా. చెల్లెల్ని తీసుకుపోతాడా, కష్టాలమీద కష్టాలు. ఎట్లా భరించేది?

ఒట్టి మా భయం తప్ప, తుప్పుడు పట్టిన కష్టమయసంసారంతో వేగిపోయి, పిచ్చియెక్కి, ఇక్కడికి కొద్దిదూరంలో నే వున్న బంధువుల యింటికి మనశ్శాంతి కోసం కొంత విశ్రాంతికోసం తల దాచుకో బోయింది. అంతేగాని, తల్లి తన బిడ్డల్ని విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లగలదు. ఎలా వెళ్లగలదు.

ఉదయంనుండి మూసిన కన్ను తెరవని చెల్లెలు, తల్లిస్పర్శ తగిలేసరికి అమ్మా అమ్మా, అమ్మా, అమ్మా, అమ్మా! గట్టిగా కౌగిలించుకుంది అమ్మ సముదాయిస్తున్నది. చెల్లెలి జ్వరం తగ్గుముఖం, పట్టేసూచన కన్పించింది మాకు. మళ్లీ ఆశాసంతోషములు వికసించాయి మాలో.

మళ్లీ మా జీవితాలకి సూర్యకాంతి చూసే అదృష్టం వుంది. తల్లినీ చెల్లెల్నీ..

—



డెన్మార్కు రాజు ఫ్రెడరిక్ IX జన్మదినోత్సవసందర్భంలో ఢిల్లీలోని డెన్మార్కు మంత్రివర్గ రాయబారి టాయిబర్గు, ఫ్రాండ్ జిక్ ఢిల్లీ జింకానా క్లబ్బులో విందుచేసిరి. టాయిబర్గుదంపతులు ప్రధాని నెహ్రూను సంభాషించుచున్నారు.

గనోక్వీన్
ఒక్క పెరెండు గంటలలో గుణము
రాజమండ్రి